క్లుప్తంగా

ఘనంగా బల్లల పండగ



రజకుల బల్లలకు, ఇస్త్రీ పెట్టెలకు పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: బల్లల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ఆదివారం వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రజకుల బల్లలకు, ఇస్త్రీ పెట్టెలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధిపై అపోహలు వీడాలి



డాక్టర్ విజయ్

అక్కిరెడ్డిపాలెం: మూర్ఛపై అపోహలు వీడాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సీహెచ్.విజయ్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ ఎపిలెప్సీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెదడులోని ఒక భాగంలో అవసరానికి మించి విద్యుత్ శక్తి ఉత్పత్తి అవ్వడం వల్ల ఫిట్స్ వస్తాయన్నారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్ ఏ భాగం నుంచి ఎక్కడికి వస్తుంది అనేదాన్ని బట్టి రోగికి ఫిట్స్ లక్షణాలు మొదలవుతాయన్నారు. ఫిట్స్ నియంత్రణకు ఎన్నో మందులు ఉన్నాయని, చికిత్స నిర్వహిస్తే మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు.

మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ



మహాశివరాత్రి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు పూజలు, అభిషేకాలు, జాగారాలు, పుణ్య స్నానాలతో తరిస్తారని, అటువంటి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పూర్ణానందశర్మ, దుల్ల రామునాయుడు, ఇల్లపు ప్రసాద్, బలిరెడ్డి నాగేశ్వరరావు, కర్రి దోమేంద్ర, నెల్లి శ్రీను, గంతకోరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సినీ ఫెడరేషన్ సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ

గాజువాక : ఏపీ తెలుగు ఫిల్మ్ టీవీ అండ్ అసోసియేటెడ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులకు ఆదివారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కార్మికుల గృహ వసతి, ప్రయాణ రాయితీ, ఇన్సూరెన్స్, పేద కళాకారుల పిల్లలకు ప్రోత్సాహకాలు, పెన్షన్ పెంపుదల వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు భూపతిరాజు శ్రీనివాసరాజు, డాక్టర్ పి.ఆశాలత, బాలు, పెనుమత్స శ్రీనివాసరాజు, కె.సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు పది వేల పెన్నులతో పూజ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలిసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ద్వాదశి, మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని, ఎర్నిమాంబ అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని దైవ సన్నిధిలో దశ సహస్ర (10 వేలు) కలములతో విశేష పూజలు నిర్వహించినట్లు ఈవో సురేష్‌బాబు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అమ్మవారి పేరుతో ముద్రించిన పెన్నులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రత్యేక ఉచిత దర్శనాలకు అనుమతించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రహదారి విస్తరణ కలేనా?



విస్తరణకు నోచుకోని కూర్మన్నపాలెం ప్రధాన రహదారి

- 2018 నుంచి నత్తనడకన పనులు
- రూ.3 కోట్లు కేటాయించిన నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ప్రజల ఇబ్బందులు పట్టని వైనం



విస్తరించాల్సిన రహదారి



కూర్మన్నపాలెం రోడ్డులో రద్దీ

కూర్మన్నపాలెం : ఏళ్లు గడుస్తున్నా.. ఇక్కడి ప్రధాన రహదారికి మోక్షం కలగడం లేదు. ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ఆశించిన కూర్మన్నపాలెం పరిసర ప్రాంత ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. జాతీయ రహదారి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ ఫ్లై ఓవర్ వరకూ రహదారిని పూర్తి స్థాయిలో విస్తరించి వాహన రాకపోకలకు ఎటువంటి ఆటంకం కలగకుండా అభివృద్ధి చేస్తామని 2018లోనే అప్పటి పాలకులు హామీలిచ్చారు. ఆ హామీ మేరకు అప్పట్లోనే రూ.9 కోట్లు నిధులు మంజూరు చేశారు. అనంతరం అట్టహాసంగా పనులకు శంకుస్థాపన చేసి ఆ తర్వాత గాలికొదిలేశారు. ప్రధానంగా రహదారి విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించడంలోనూ.. టీడీఆర్‌లు ఇవ్వడంలోనూ ఆ ప్రభుత్వం అలసత్వం వహించింది. దీంతో రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగలేదు. అంతేకాకుండా టీడీఆర్‌ల విషయంలో అప్పట్లో అధికారులు కొర్రీలు పెట్టడం..ఆ తరువాత నష్టపరిహారం ఎంతన్నది ప్రకటించకపోవడంతో ప్రజలు తమ స్థలాలను ప్రభుత్వానికి ఇవ్వడానికి ముందుకు రాలేదు. దీంతో పాలకులు కూడా పట్టనట్టు వ్యవహరించడంతో విస్తరణ విషయం దాదాపు అందరూ మరచిపోయారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

ఈ కథ ముగిసిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. విస్తరణ పనులకు సంబంధించిన ఫైలుపై స్థానిక నాయకులు, మంత్రులు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కొత జాప్యం జరిగినా..ఆ తరువాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో కేటాంచిన రూ.9 కోట్లు నిధులు చాలవని గుర్తించి మరో 3.కోట్లు అదనంగా కేటాయించింది. మొత్తం రూ.12 కోట్లతో పనులు ప్రారంభించి కాలువల తవ్వి, విస్తరణకు అడ్డుగా ఉన్న భవనాల తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈలోగా ప్రభుత్వం మారిపోవడంతో కొత్తగా వచ్చిన పాలకులు రహదారి విస్తరణను పూర్తిగా విస్మరించారు. ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు వేలాది మంది ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నారు. అంతేకాకుండా ఎంతో ప్రాముఖ్యత కలిగిన దువ్వాడ రైల్వే స్టేషన్‌కు కూడా ఈ రోడ్డు గుండానే వెళ్లాలి. అయితే రహదారి విస్తరణ ఆగిపోవడం.. ఎక్కడికక్కడ కాలువలు తవ్వేసి విడిచిపెట్టేయడం, భవనాల తొలగింపులో మిగిలిన శిథిలాలు రోడ్డుపైనే ఉండడం వల్ల పరిస్థితి అధ్వానంగా మారింది. దీని వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడడంతో పాటు వాణిజ్య వ్యాపార సంస్థలు వారు కూడా వ్యాపారాలు సాగక అవస్థలు పడుతున్నారు. అయితే సగం సగం తొలగించిన షాపుల్లోనే వ్యాపారాలు సాగించాల్సి వస్తోందని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టీడీఆర్‌లు క్లియర్ చేసి రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



రహదారి విస్తరణ పనులు తక్షణమే ప్రారంభించాలి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనులు ముమ్మరంగా చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విస్తరణ పనులను పట్టించుకోవడం లేదు. వెంటనే టీడీఆర్‌లు క్లియర్ చేసి త్వరితగతిన రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలి. అప్పుడే ప్రజలు ఇబ్బందులు గట్టెక్కుతాయి.

– వానపల్లి రామచంద్ర రాజు, వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి



రాకపోకలకు అంతరాయం

రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడం వల్ల వ్యాపారాలు కుంటుపడ్డాయి. సాయంత్రం వేళల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అధికారులు వెంటనే స్పందించాలి. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

–చిట్టి బాలకృష్ణ, కూర్మన్నపాలెం



పాలకులు స్పందించాలి

రహదారులు విస్తరిస్తే కూర్మన్నపాలెం ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అధిక మొత్తంలో నిధులు కేటాయించి విస్తరణ పనులు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులను గాలికి వదిలేసింది. పాలకులు, అధికారులు స్పందించాలి.

– డి.క్రాంతి, కణితి కాలనీ

విండ్‌బాల్ పోటీలు ప్రారంభం



విండ్‌బాల్ పోటీలు ప్రారంభిస్తున్న దుల్ల రామునాయుడు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లక్కరాజుపాలెం సఖ్యతా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విండ్‌బాల్ పోటీలను గ్రామపెద్ద దుల్ల రామునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం వల్ల పెడదోవ పట్టకుండా ఉండేందుకు దోహదపడతాయన్నారు. క్రీడలపై ఆసక్తి పెరిగి చెడు వ్యసనాలకు, స్నేహాలకు దూరంగా ఉంటారన్నారు. ఈనెల 13వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. అలాగే పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో విందుల చిరురాజు, లక్కరాజు వెంకటేష్, శివకుమార్, శీలం వెంకటరావు, లక్కరాజు పూలన్‌కుమార్, సూరిబాబు పాల్గొన్నారు.

సీఎంకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు

అగనంపూడి: విశాఖ ఉక్కు అధికారి నాట్ర తాతారావు మృతిపై అనుమానాలు నివృత్తి చేయాలని, ఎలా మృతి చెందారో విచారణ చేపట్టి న్యాయం చేయాలని తాతారావు భార్య బంగారమ్మ సీఎంకు ఫిర్యాదు చేశారు. అయితే విచారణ జరపకుండానే పరిష్కరించామని కార్యాలయం నుంచి సమాధానం రావడంపై సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు విస్మయం వ్యక్తం చేశారు. గతంలో డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేస్తే సంబంధిత కార్యాలయం లేఖను తీసుకోడానికి నిరాకరించిందని, దీంతో మూడు మాసాల క్రితం తాతారావు మరణంపై మిస్టరీ తేల్చాలని సీఎంకు ఫిర్యాదు చేశామని, అయితే సీఎం కార్యాలయం నుంచి రెండు సార్లు బంగారమ్మకు ఫోన్లు వచ్చాయన్నారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు ఎటువంటి విచారణ చేయకుండానే చేసినట్టు సీఎం కార్యాలయానికి తెలపడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయకుండా కూటమి ప్రభుత్వంలో అధికారులు వ్యవహరించడం తగదన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి నష్టం కలిగితే సహించం



ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి నష్టం కలిగించాలని చూస్తే పోరాటం తప్పదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు అన్నారు. ఆదివారం స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లగా కాంట్రాక్ట్ కార్మికులు ఉక్కు ఉత్పత్తి కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్మికులను తొలగించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఒకవైపు పర్మనెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరిట పంపించి, మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించి ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందన్నారు. ఉత్పత్తిని పెంచి నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ద్రోహం చేస్తున్నాయన్నారు. కార్మికులందరూ మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో కె.ఎం. శ్రీనివాస్, జి. శ్రీనివాసరావు, ఎస్. రమణ, సోమేష్, శశిభూషణ్, కృష్ణ, రమణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలి



లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలను కేటాయించి రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ గాజువాక నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని సంజీవిగిరి కాలనీలో అర్హులైన లబ్ధిదారుల నుంచి ఆదివారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసినప్పటికీ స్థలాలు మాత్రం కేటాయించలేదన్నారు. అధికారులు స్పందించి వెంటనే లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు సదుపాయాలు కల్పించాలి

పెదగంట్యాడ మండలంలోని టిడ్కో లబ్ధిదారులకు వెంటనే సదుపాయాలు కల్పించాలని కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు టిడ్కో లబ్ధిదారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయాల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించలేదని, దీంతో వారికి బ్యాంకు రుణాలు చెల్లించాలనే ఒత్తిడి పెరిగిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని లేనిపక్షంలో ఈ నెల 12 నుంచి రిలే నిరాహారదీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అచ్యుతారావు, ఆనంద్, పెదపూడి దుర్గారావు, శివ, వనజాక్షి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కబడ్డీ టోర్నీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు బాపూజీ, రమేష్‌బాబు తదితరులు

పెదగంట్యాడ: గ్రామీణ క్రీడల అభివృద్ధిలో భాగంగా అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో గంగవరం జాలారిపల్లి పాలెంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. విజేతలకు కార్పొరేట్ హెడ్ బాపూజీ, అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ విభాగం రమేష్‌బాబు, జాలారిపల్లిపాలెం గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు అధికారులు బాపూజీ, రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో మొత్తం 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇటీవల కాలంలో గంగవరం పోర్టు వాలీబాల్, క్రికెట్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ తదితర టోర్నమెంట్‌లు నిర్వహించిందని, గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, యువతకు ఉపాధి, కమ్యూనిటీ ఇన్‌ఫ్రా వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదానీ ఫౌండేషన్ సీఎస్సార్ హెడ్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



చిన్నారులతో శ్రీలక్ష్మియాదవ్

మల్కాపురం: 61వ వార్డు మల్కాపురం, గొల్లవీధి ప్రాంతానికి చెందిన జై కృష్ణ కోలాటం గ్రూప్ చిన్నారులకు అవసరమైన కోలాటం స్టిక్స్(కర్రలు)ను స్థానిక మహిళా నాయకురాలు సర్వసిద్ధి శ్రీలక్ష్మియాదవ్ అందించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులు ఆదివారం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. దీన్ని చూసిన శ్రీలక్ష్మి యాదవ్ తన వంతుగా వారికి అవసరమైన స్టిక్స్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో జై శ్రీకృష్ణ కోలాట గురువు నూనెల లావణ్యాయాదవ్, ఉరుకూటి పైడిరాజు(పెంటా) పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యసాయి సమితి, భజన మండలి ప్రతినిధులు

ఉక్కునగరం: పేద విద్యార్థి కె.ధనశ్రీ చదువు నిమిత్తం ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి, అగనంపూడి భజన మండలి రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేసింది. అనకాపల్లి జిల్లా ఉడ్‌పేటకు చెందిన కె. హేమలత భర్త లలితారావు స్కూటర్ మెకానిక్. అతను 2023లో అనారోగ్యంతో మృతి చెందాడు. హేమలత టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఆమె కుమార్తె ధనశ్రీ అనకాపల్లిలోని ఓ ప్రైవేటు కాలేజీలో బీబీఏ చదువుతోంది. ఆమె రెండో ఏడాది ఫీజుగా రూ. 20 వేలు కట్టాల్సి ఉంది. సాయం కోసం వారు భజన మండలిని సంప్రదించారు. ఆదివారం సత్యసాయి సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, ఎస్‌కేఆర్‌కే రాజు చేతులమీదుగా ధనశ్రీ తల్లి హేమలతకు రూ.25 వేలు, నోట్ బుక్స్, సత్యసాయి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి కన్వీనర్ విందుల పైడినాయుడు, వి.రామారావు, డి.గణేష్, మైండ్ క్యూర్ వైద్యులు ఎం.బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలచే పని చేయించడమే మానవ హక్కుల కౌన్సిల్ కర్తవ్యం

డాబాగార్డెన్స్: ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సమస్యలు పరిష్కరించడమే మానవ హక్కుల కౌన్సిల్ కర్తవ్యమని కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్‌కి ఆదివారం నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కులు ఏంటి? ఉల్లంఘిస్తే డిఫెండర్లుగా మనం ఏం చేయాలి? హ్యూమన్ రైట్స్ ఎలా ఉన్నాయి? తదితర చట్టాల గురించి పలువురు న్యాయకోవిదులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అసలు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎప్పుడు ప్రారంభమైంది? ఏ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రారంభించబడింది? అనే అంశాలపై డిఫెండర్స్‌కు వివరించారు. సీనియర్ అడ్వకేట్ ఐఎం అహ్మద్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వేలాది మంది సీనియర్ సిటిజన్స్ ఉన్నారని, వారంతా మానవ హక్కులు కోల్పోతున్నారని, వాటిని తెలియజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్వీ రమణ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి గౌరవం, విలువ ఉంటాయన్నారు.

సాగర తీరం...స్మృతుల పరిమళం

యారాడ తీరంలో పూర్వ విద్యార్థుల సందడి



యారాడ తీరంలో సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: ఆహ్లాదకర యారాడ తీరం ఆదివారం స్మృతుల పరిమళాన్ని అద్దుకుంది.. యారాడ తీరంలో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1985–86 సంవత్సరంలో గాజువాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఉదయం యారాడ తీరానికి చేరుకున్నారు. అక్కడ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. అప్పట్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుని తలపుల్లో విహరించారు...నలభైఏళ్ల అనంతరం కలుసుకున్న ఆ మిత్రబృందం అనందానికి అకాశమే హద్దయింది. దాదాపు 100 మంది పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరడంతో కోలాహలం నెలకొంది. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రోజంతా ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఆటలు పోటీలు పెట్టుకుని విజేతలకు బహుమతులు అందజేశారు. తమతో కలిసి చదువుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకోవాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. విద్యను బోధించిన గురువులను గుర్తు చేసుకున్నారు. మళ్లీ కలుద్దామంటూ భారమైన మనసులతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గంథం శ్రీనివాసరావు, కులుకూరి మంగరాజు, హరి, కనకమహాలక్ష్మి, శంకర్, శ్రీధర్‌రెడ్డి, అపరపిన్ని రమణ, ప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ



మూడు పీఠాలతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం



దివ్య ప్రసాదం అందిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు ఆర్చి బిషప్ పాలిమేర జయరావ్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్రపీఠం ప్రత్యేక పరిపాలనాధికారి (ఆర్చి బిషప్) డాక్టర్ పాలిమేర జయరావ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవళి మధ్యలో సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె, ద్రాక్షరసాన్ని ఆశీర్వదించి భుజించమని చెప్పారన్నారు. దివ్య పూజబలిలో సత్ప్రసాదంలోని సాక్షాత్తు క్రీస్తు ప్రభు అంశ ఉంటుందన్నారు. పండగలో భాగంగా సుమారు 120 మంది చిన్నారులు నూతనంగా దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం సాయంత్రం జ్ఞానాపురంలోని వడివర్లవీధి, స్లీప్‌సర్తు మండపంలో, పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసిన పీఠాల వద్ద దివ్య సత్ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండగ వాతావరణంతో పవిత్ర హృదయంతో జరిగిన పాదయాత్రలో నగరం నలుమూలల నుంచి అనేక మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశాఖ ఆర్చి ప్రత్యేక పాలనాధికారి బిషప్ పాలిమేర జయరావ్ మాట్లాడుతూ వాటికన్ నుంచి పోప్ ఫ్రాన్సిస్ ద్వారా వచ్చిన వర్తమానాన్ని ఈ సందర్భంగా విశాఖ నూతన అగ్రపీఠం ఆర్చిబిషప్‌గా డాక్టర్ ఉడుముల బాల నియమితులైనట్లు జయరావ్ తెలిపారు. సెయింట్ పీటర్స్ విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ పాల్గొన్నారు.

గు'భేల్' రహదారులు



భెల్ టౌన్ షిప్ నుంచి తుంగ్లాం గేటు వరకు గులకరాళ్లతో తేలిన రోడ్డు



భెల్ టౌన్ షిప్ గేటు సమీపంలో అధ్వానంగా రహదారి

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఉద్యోగులతో పాటు టౌన్ షిప్‌లో వారి కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సిగ్నల్ పాయింట్..భెల్ టౌన్ షిప్ గేటు నుంచి టౌన్ షిప్ ప్రారంభం నుంచే గోతులు స్వాగతం పలుకుతున్నాయి. భెల్ క్రీడా మైదానం ఎదురుగా రోడ్డుపూర్తిగా గోతుల మయంగా మారింది. భెల్ యాజమాన్యం స్పందించి రహదారులను మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.